ప్రజాశక్తి
గురువారం 16 ఏప్రిల్ 2024
5
విజయనగరం

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేస్తూ పార్వతీపురం మన్యం ఆర్‌టిఎ విభాగంలో విధులు నిర్వహిస్తూ, ఇటీవల గుండెపోటు తో మరణించిన కె.మహేశ్వరరావు కుటుంబానికి హోంగార్డులంతా ఆర్థిక సాయం చేశారు. ఆయన సతీమణి కె.ధనలక్ష్మి హోంగార్డులు చేయూత గా అందించిన ఒక్క రోజు అలవెన్స్ రూ.3.20 లక్షల చెక్‌ను ఎస్‌పి ఎం.దీపిక బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ ప్రభాకరరావు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

మహిళలు, యువత ఓట్లే కీలకం

- పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నీ తమవేనంటున్న టిడిపి
- మహిళలు తమకే సహకరించారంటున్న వైసిపి
- గ్రామాల వారీగా లెక్కలు
- కూడికలు, తీసివేతల్లో నాయకులు బిజీబిజీ
- అందరిలోనూ గెలుపు ధీమా

సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మహిళలు, యువత పాత్ర అత్యంత కీలకంగా ఉండబోతుంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు తీవ్ర ప్రభావం చూపనున్నారు. మహిళా ఓటర్లలో ఎక్కువ మంది తమకే సహకరంచారని వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండగా, యువత మొత్తం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, టిడిపి అనుకూలంగా ఓట్లు వేశారని టిడిపి అంచనాలు వేస్తోంది. దీనికితోడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు టిడిపి అనుకూలంగాను, వైసిపికి వ్యతిరేకంగా ఉంటాయని ఇరు పార్టీల నాయకులు అంగీకరిస్తున్నారు. మరోవైపు గ్రామాలు, వార్డుల వారీగా, బూత్ నెంబర్ల వారీగా టిడిపి, వైసిపి నాయకులు అంచనాల వేసుకోవడంలో బిజీబిజీగా మారారు. మంగళ, బుధవారాలో ఇటువంటి సమావేశాలు, సమీక్షలతో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు తలమునకలయ్యారు. టిడిపి అభ్యర్థులు తామే గెలుస్తామంటూ ధీమా వ్యక్తం చేస్తుండగా, స్వల్ప మెజార్టీతోనైనా గట్టెక్కిపోతామని వైసిపి అభ్యర్థులు, వారి అనుయాయులు అంచనాలు వేస్తున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోలింగ్ సరళిని ఒక్కసారి పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో మొత్తం 15,62,921 ఓట్లు ఉండగా, 12,71,173 ఓట్లు పోలయ్యాయి. 2,91,748 మంది ఓటర్లు తమ హక్కును ఉపయోగించుకోలేదు. 18ఏళ్ల నుంచి 19ఏళ్లలోపు వయసుగల ఓటర్లు 39,612 మంది ఉన్నారు. వీరంతా తొలిసారిగా ఓటు హక్కుపొందిన విద్యార్థులు. వీరిలో చాలా వరకు జనసేన అభిమానులు, మిగిలినవారిలో టిడిపి, వైసిపిలకు చెరుసగం ఉంటారని అంచనా. ఈ లెక్కన 19ఏళ్లలోపుగల ఓటర్లంతా కూటమికి ఓట్లువేసి ఉండవచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. 20 నుంచి 29ఏళ్లలోపు వయసుగల ఓటర్లు 2,45,813 మంది ఓటర్లు వరకు ఉన్నారు. వీరిలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు కూడా ఉన్నారు. సాధారణంగా ఉద్యోగులు, నిరుద్యోగుల్లో వైసిపి ప్రభుత్వంపై గడిచిన కొంతకాలంగా వ్యతిరేకత వ్యక్తమైంది. జిల్లాలో 18,869 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. ఇతర జిల్లాల నుంచి మరో 2,773 బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. వీరంతా ఉద్యోగులే. ఉద్యోగులంతా తమవైపే ఉన్నారని టిడిపి బలంగా చెబుతోంది. అటు వైసిపి నాయకులు కూడా వీరి ఓట్లను అంతగా లెక్కపెట్టడం లేదు. అత్యధికంగా విజయనగరం అసెంబ్లీ పరిధిలో 4,201 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాయ కుల్లో గుబులు, టిడిపి నాయకుల్లో జోష్ కనిపిస్తోంది. ఇక మహిళా ఓటర్ల సరళిని ఒక్కసారి పరిశీలిస్తే.... జిల్లాలో మొత్తంగా 7,92,038 మంది మహిళా ఓటర్లు ఉండగా, వారిలో 6,44,844 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు మొత్తం 7,70,805 మంది ఓటర్లు కాగా, 6,26,307 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పురుషులు కన్నా మహిళా ఓటర్లు 21,233 మంది అధికంగా ఉండగా, పోలైన ఓట్లలో పురుషులకన్నా 18,537 మహిళా ఓట్లు అధికంగా ఉన్నాయి. దీన్నిబట్టి మహిళా ఓట్లు కొంతమేర ఎన్నికల్లో ప్రభావితం చూపుతాయి. ప్రధానంగా టిడిపికూటమి మేనిఫెస్టోలో ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, బస్సు ప్రయాణం వంటి పథకాలు మహిళలను ఆకర్షించాయని చర్చ జరుగుతోంది. అదే సందర్భంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో ఎక్కువ శాతం మహిళల పేరునే మంజూరు చేయడం, వాటిలోనూ చేయూత, ఆసరా వంటి పథకాలతో తమకే ఓట్లు పడతాయని వైసిపి నాయకులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాలు, డ్వాక్రా రుణాలు మాఫీ, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన తదితర పథకాలు మహిళ లను ఆకర్షించాయ నడంలో సందేహం లేదు. కానీ, ఈ పథకాలేవీ స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయలేదు. దీనికితోడు వీరు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసినప్పుడు ప్రభుత్వం అరెస్టులు, నిర్బంధాలు, భయోత్పాతాలకు పాల్పడడం వల్ల మహిళా ఓటర్లలోనూ చీలిక ఉంటుందని కూడా మరో విశ్లేషణ ఉంది. వలస ఓటర్లలో ఎక్కువ శాతం ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా ఉండే అవకాశం ఉంటుందని రాజకీయ నాయకులు అంచనాలు వేస్తున్నారు. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత కూడా వైసిపికి కొంత ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇటువంటి చోట గతంలో టిడిపి తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులపై సానుభూతి కూడా కనిపిస్తోంది. రైతు భరోసా పథకం, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా వైసిపి ప్రభుత్వం రైతు కుటుంబాలకు చాలా వరకు దగ్గరైనప్పటికీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై టిడిపి చేసిన ప్రచారం ఆ తరగతిలోని వైసిపి ఓట్లను చాలా వరకు చీల్చే అవకాశం కూడా లేకపోలేదు. మద్యం ధరల పెంపుతోపాటు బ్రాండ్ల మార్పు, నాసిరకం లిక్కర్ అందుబాటులో ఉంచడం వంటివాటిపై మందుబాబులు ప్రతికూల తీర్పును ఇచ్చి ఉండవచ్చేమో అన్న చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు బయటకు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల భయం కనిపిస్తోంది.

ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

పోలైన ఓట్లను పరిశీలిస్తే..

	మొత్తం ఓట్లు	పోలైనవి
మహిళలు	7,92, 038	6,44,844
పురుషులు	7,70,805	6,26,307

కలెక్టరేట్ ఎఒకు వినతినిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఎన్నికల విధులు నిర్వహించిన

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మిని కలిసేందుకు వెళ్లి ఆమె అందుబాటులో లేకపోవడంతో ఎఒకు వినతిని అందజేశారు. జిల్లాలో పోలింగ్‌ను విజయవంతం చేసినప్పటికీ, విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని తెలిపారు. ప్రధానంగా పిఒ, ఎపిఒలు ఈనెల 12,13,14 తేదీల్లో (మూడురోజులు) విధులు నిర్వహించినప్పటికీ రెండు రోజులకే రెమ్యునరేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు రోజుల రెమ్యూనరేషన్‌తో పాటు, ట్రైనింగ్ రోజు కలిపి డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. రిజర్వులో ఉన్న ఉద్యోగులకు రెమ్యునరేషన్ కొన్ని నియోజక వర్గాల్లో ఇవ్వలేదని, తక్షణమే వారికి రెమ్యునరేషన్‌తో పాటు సర్టిఫికేట్ ఇవ్వాలని కోరారు. అన్ని నియోజకవర్గాలకు రిసీవింగ్ సెంటర్ విజయనగరంలో పెట్టడం వల్ల చాలా ఇబ్బందుల గురయ్యారని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు రిసెప్షన్ సెంటర్‌లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, సరైన భోజనాలు పెట్టలేదని, వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గజపతినగరం నియోజకవర్గంలో విధుల్లో ఉన్న పిఒపై కొంతమంది భౌతికదాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాజాం నియోజకవర్గంలో అస్వస్థతకు గురైన ఉపాధ్యాడికి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయిక్, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, ఎస్‌టియు రాష్ట్రకార్యదర్శి డి.శ్యామ్, ఆపస్ రాష్ట్ర కార్యదర్శి ఇ.రామునాయుడు, జిల్లా కార్యదర్శి వెంకట నాయుడు పాల్గొన్నారు.

సెంచూరియన్ యూనివర్శిటీ బస్సును ఢీకొన్న టిప్పర్

కేబిన్‌లో ఇరుక్కుపోయిన బస్సు డ్రైవర్

సెంచూరియన్ బస్సును ఢీకొన్న టిప్పర్

- 8 మంది విద్యార్థులకు గాయాలు
- ఓ విద్యార్థినికి విరిగిన కాలు
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

ప్రజాశక్తి-బొండపల్లి

మండల కేంద్రమైన బొండపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సెంచూరియన్ యూనివర్శిటీకి చెందిన బస్సును ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిలో ఒక విద్యార్థినికి కాలు విరిగిపోయింది. గజపతినగరం నుంచి నెలిమర్ల మండలం చందకపేట వద్ద ఉన్న సెంచూరియన్ యునివర్సిటీకి విద్యార్థులను తీసుకువెళ్తున్న బస్సును గజపతినగరం వైపు ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ అదుపు తప్పి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులకు గాయాలు కాగా వీరిలో లోగిస గ్రామానికి చెందిన వసంత కుమారికి కాలు విరిగిపోయింది. వెంటనే స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను గజపతినగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయనగరంలోని ఓ ప్రైవేటుఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ ప్రమాదంలో బస్సును నడుపుతున్న డ్రైవర్ కృష్ణంరాజు క్యాబిన్ లో ఇరుక్కుపోవడం తో కట్టర్‌తో రాడ్‌లను కట్ చేసి ఆయనను బయటకు తీశారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడి రోధిస్తున్న విద్యార్థిని

అంగన్వాడీ,ఆశాలకు ఎన్నికల అలవెన్సులు ఏవీ?

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా విధుల్లో పాల్గొన్న హెల్త్ సిబ్బందికి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు అలవెన్స్ లభించలేదు. ఉదయం మాక్‌పోల్‌నుంచి పోలింగ్‌పూర్తయిన అర్ధరాత్రి వరకూ విధులు నిర్వహించిన వీరికి ఉత్తిచేయే చూపించారు.

పోలింగ్‌కు ముందే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఐసిడిఎస్ పీడీని కలిసి అధికారికంగా డ్యూటీలు వేసి వారందరికీ ఎన్నికల అలవెన్స్‌లు ఇవ్వాలని ముందుగానే కోరారు. కానీ అధికారులు అధికారికంగా ఆదేశాలు ఇవ్వకుండా ఫోన్‌సమాచారం ద్వారా పోలింగ్ విధులు నిర్వహించాలని ఆశ, అంగన్వాడీ వర్కర్లకు సమాచారం ఇచ్చారు. దీంతో విజయనగరం జిల్లాలోని 4400మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, 1785 మంది ఆశావర్కర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 3160 మంది అంగన్వాడీలు, 1470 మంది ఆశావర్కర్లు 1530 మంది సిహెచ్ డబ్ల్యులు విధులు నిర్వహించారు. అంగన్‌వాడీలకు అధికారంగానే డ్యూటీలు వేశారు.

వీరంతా పోలింగ్ కేంద్రాల వద్ద ఆశా వర్కర్లకు, అర్బన్ పిహెచ్‌సిల్లో పని చేసే సెకండ్ ఎఎన్ఎంలకు డ్యూటీలు వేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన మాక్ పోలింగ్ నుండి సాధారణ పోలింగ్ పూర్తయిన అర్ధరాత్రి వరకూ కేంద్రాల వద్ద హెల్త్ సిబ్బందితో కలిసి విధులు నిర్వర్తించారు. ఇతర సిబ్బంది అందరికీ అలవెన్స్ అందిస్తున్న అధికారులు ఆశాలకు, అంగన్వాడీలకు మాత్రం మొండిచేయి చూపారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సేవలందించిన తమకు అలవెన్స్ ఎగ్గొట్టడం దారుణమని వారంతా ఆవేదన చెందుతున్నారు. చాలా పోలింగ్ కేంద్రాల వద్ద వద్దులు, మహిళలు ఎండ వేడిమి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. వారికి ఆశాలు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు కలిపి అందజేశారు. చంటి పిల్లలతో వచ్చిన ఓటర్లు ఓటు వేసి వచ్చినంత వరకు అంగన్వాడీలు ఆ పిల్లల ఆలనా పాలనా చూశారు. భోగాపురం, గుర్ల, కొత్తవలస, రాజాం, వీరఘట్టం, భోగాపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, విజయనగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది. అప్పటివరకూ వీరంతా ఇవిఎంలతో సిబ్బంది బస్సులో బయల్దేరి వరకూ అక్కడే విధులు నిర్వర్తించారు. కానీ వీరి సేవలను అధికారులు గుర్తించలేదు. 2019 ఎన్నికల్లో ఆశాలకు కూడా పోలింగ్ డ్యూటీ వేసి అలవెన్స్ అందించారు. ఈసారి ఎన్నికల్లో డ్యూటీ చేసిన వారికి పారితోషికం ఇవ్వకపోవడాన్ని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి ఖండించారు. నేరుగా డ్యూటీ వేయకుండా మెడికల్ క్యాంపు పేరుతో పోలింగ్ పూర్తయ్యే వరకూ డ్యూటీ చేయించి అలవెన్సు ఇవ్వకపోవడం అన్యాయమని, వారందరికీ వెంటనే అలవెన్సు చెల్లించాలని అధికారులను కోరారు.

పోలింగ్ కేంద్రం వద్ద సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు

గత ఫలితాలు పునరావృతం

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోను, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2019 ఫలితాలు పునరావృతం అవుతాయని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేసిందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం తీవ్రంగా శ్రమించారని కితాబు ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీల బెదిరింపులు, కుట్రలను లెక్కచేయకుండా పనిచేశారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిగా పనిచేయడం వల్లే పార్టీకి మంచి పేరు వచ్చిందన్నారు. జగన్‌పై ఉన్న నమ్మకంతో పెద్ద ఎత్తున పొల్గొని, ఓటు వేశారని తెలిపారు. విజయనగరం జిల్లాలో అర్ధరాత్రి 3 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పెరిగిన పోలింగ్ శాతంతో వైసిపికి కలిసి వచ్చే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు నెక్కల నాయుడుబాబు, కెవి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాల వారీ పోలైన ఓట్ల వివరాలు

	2014			2019			2024		
	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
రాజాం	1,99,230	1,47,974	73.82	2,19,913	1,63,357	73.40	2,27,503	1,72,906	76.00
బొబ్బిలి	2,11,986	1,68,420	79.11	2,20,854	1,75,028	79.34	2,31,232	1,85,775	80.34
చీపురుపల్లి	1,89,401	1,54,117	81.11	1,98,832	1,66,097	82.96	2,31,232	1,85,775	80.34
గజపతినగరం	1,87,066	1,59,908	84.19	1,98,309	1,72,649	86.56	2,05,484	1,77,612	86.44
నెల్లిమర్ల	1,89,233	1,66,301	87.69	2,01,722	1,82,925	87.81	2,13,551	1,88,456	88.25
విజయనగరం	2,16,301	1,55,387	71.28	2,32,031	1,65,115	70.86	2,57,205	1,84,787	71.84
శృంగవరపుకోట	2,02,518	1,72,145	84.22	2,13,399	1,84,111	85.81	2,22,475	1,90,104	85.45
జిల్లా మొత్తం	**13,95,735**	**11,24,252**	**80.00**	**14,85,054**	**12,09,282**	**80.67**	**15,85,206**	**12,84,900**	**81.06**

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూములకు కల్పించిన మూడంచెల భద్రత, బందోబస్తు పరిశీలించారు. మొదటి స్థాయిలో స్థానిక పోలీసులు, రెండో స్థాయిలో రాష్ట్ర సాయుధ బలగాలు, మూడో స్థాయిలో కేంద్ర సాయుధ బలగాల పహరా ఏర్పాటు చేశారు. రేయింబవళ్లు పహారాతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని భద్రతా అధికారులకు వారు సూచించారు. కార్యక్రమంలో జెసి ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసాన్ని సరిచేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు పారితోషికాల చెల్లింపుల్లో వ్యత్యాసం చూపారని, వెంటనే సవరించి విధుల్లో పాల్గొన్న అందరికీ సమానంగా అందించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పిఒ, ఎపిఒలకు రూ.1750 చెల్లించారని, కొన్నిచోట్ల ఎపిఒలకు రూ.1250 చెల్లించారని తెలిపారు. రిజర్వ్‌లో ఉన్నవారికి కొన్ని చోట్ల చెల్లింపులు జరగలేదని చెప్పారు.

ఎవరి ధీమా వారిది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఓట్ల పండగ ముగిసింది. ఇక ప్రజాతీర్పే మిగిలింది. మరో 18 రోజులు తీర్పు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి అవిశ్రాంతంగా పనిచేసిన రాజకీయ పార్టీల నేతలు, అధికారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై నాయకులంతా లెక్కల్లో మునిగి తేలారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, అనుకూల, ప్రతికూల ఓట్లపైనా ఆరా తీస్తున్నారు. కూడికలు, తీసివేతలతో ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నువ్వా నేనా అన్నట్లు సాగిన అధికార వైసిపి, టిడిపి కూటమి పోరులో విజయం ఎవదరిదనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఇక ఎన్నడూ లేనంతగా నియోజకవర్గంలో 71.84 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 19,672 ఓట్లు, పోస్టల్‌బ్యాలెట్ 4201 ఓట్లు అదనంగా పోలయ్యాయి. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికల్లో చెదురుమదరు ఘటనలు మినహా నియోజకవర్గంలో 260 కేంద్రాల్లో అంతటా ప్రశాంతంగా జరిగింది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 11 గంటల వరకు నిరీక్షించి మరీ ఓటర్లు ఓటేశారు. అసెంబ్లీకి 15 మంది పోటీచేశారు. అయితే ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, టిడిపి అభ్యర్థి పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, స్వతంత్ర అభ్యర్థి మీసాల గీత మధ్య పోటీ నెలకొంది. గతంలో పోలిస్తే పెరిగిన ఓట్లతో తమకే అనుకూలిస్తుందని అభ్యర్థులు వరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాము అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని అధికార పార్టీ నేతలు చెబుతుండగా, వైసిపి ప్రభుత్వ అవినీతి, దౌర్జన్యం సహించలేక ఓటర్లు తమవైపే మొగ్గుచూపారంటూ ఎన్‌డి కూటమి అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. నియోజకవర్గంలో పెరిగిన ఓటింగ్ శాతం తమదేనని, ఖచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక కోలగట్ల వీరభద్రస్వామి విజయం తమదేనని ధీమాగా ఉన్నారు. ఇండియా కూటమి నుంచి సుంకరి సతీష్ సైతం ఓటింగ్ సరళిని అంచనా వేసి ఎన్ని ఓట్లు వస్తాయని అంచనా వేసుకునే పనిలో ఉన్నారు. అయితే విజయం ఎవరిదో వచ్చేనెల 4వరకు వేచి ఉండాల్సిందే.

వైసిపి, టిడిపి అభ్యర్థులు కోలగట్ల, అదితి విజయలక్ష్మి

నేడు శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక విద్యుత్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిఎస్సి కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, బి.టెక్ కెమికల్, ఎమ్మెస్సి కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసి 21 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువకులు అర్హులన్నారు. వేతనం రూ.18వేలు నుంచి 24వేలు వరకు ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు.

18న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 18న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రామారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఎంపిపి అంబళ్ల సుధారాణి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు, తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశంపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికార్లు హాజరు కావాలని కోరారు.

సంకిలి గ్రామంలో కురుస్తున్న వర్షం

పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, ఉంగరాడ మెట్ట, దేవుదల, కొమిరి తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఉదయం 8 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం పడ్డంతో ప్రజలు ఉపశమనం పొందారు. గంటకుపైగా వర్షం పడటంతో అపరాలు పంటలకు మేలు చేకూరుతుందని, ముఖ్యంగా జీడి, మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వీరఘట్టం : మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, వర్షం కురిసింది. కొంతమేర ఊరట ఇవ్వడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో రెండు రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయి దీంతో ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతోంది. మధ్యాహ్న సమయంలో ఎండలు అధికంగా ఉండటంతో ప్రజలు వేడిని తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. బుధవారం సాయంత్రం చిరుజల్లులు కురిసి, వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయం డిపిఎం పి.షణ్ముఖరావు తెలిపారు. మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసుకోవడానికి సిద్ధంగా ఉంచిన నవధాన్యాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి, రాగి వేసే రైతులు శ్రీ పద్ధతిలో వేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించడానికి ఆస్కారం కలుగుతుందని చెప్పారు. వరి గట్టులపై చిక్కుడు, బెండ, బీర, బంతి వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌ఛార్జి వి.పోలినాయుడు, బి.ధనుంజయ, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగుడబ గ్రామంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.నారాయణ బుధవారం తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణులకు గడువులోపు టీకాలు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ పరిమితి చూసి సకాలంలో టీకాలు వేయాలన్నారు. గ్రామంలో టీకాలు పూర్తయిన వెంటనే రికార్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, నాగమ్మ ఎఎన్ఎం రామలక్ష్మి, సిహెచ్ఒ జగదీష్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పార్వతీపురం రూరల్ సిఐ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజలు సహకరించి ఎలాంటి సంఘటనలు జరగకుండా విజయవంతం చేశారని తెలిపారు. జూన్ 4న జరిగే ఎన్నికల లెక్కింపు వరకు ఇదే సహకారాన్ని ప్రజలు కొనసాగించాలని, పోలీసులతో సహకరించాలని కోరారు.

సీతానగరం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వరకు గ్రామాలలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

డిఎస్‌పిని సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

ఆర్‌పిఎఫ్ డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్న ఆర్‌పిఎఫ్ డిఎస్‌పి కె.సి.నాయక్, సిబ్బందిని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి తమతో పాటు కృషిచేసిన ఆర్‌పిఎఫ్ డిఎస్‌పి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలుగా తమ సిబ్బందితో కలిసి ప్రతి విషయంలో అందుబాటులో ఉంటూ సేవలందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్, ఆర్‌పిఎఫ్ సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్పా వీధిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని రెండో సచివాలయ పరిధిలోనే కస్పా వీధిలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, ఎఎన్ఎం జానకి, తదితరులు పాల్గొన్నారు.

అంచనాల్లో తలమునకలు

- బూత్‌ల వారీగా లెక్కలు
- మెజారిటీపై ఎవరి అంచనాలు వారివే
- భారీగా పెరిగిన ఎన్నికల ఖర్చు
- డబ్బు, యువ ఉత్సాహంతో పెరిగిన పోలింగ్ శాతం
- ప్రభావితం చేయనున్న మహిళ, యువ ఓటర్లు



ప్రజాశక్తి- చీపురుపల్లి

40 రోజుల రాజకీయ సమరం ముగిసింది. రాజకీయ పార్టీలు కోట్ల రూపాయలను ఎన్నికల్లో గుమ్మరించారు. అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూల్ ఇచ్చిన నాటి నుంచి ఈ నెల 13 సోమవారం వరకు నియోజకవర్గమంతటా ఓటు చుట్టూ తిరిగింది. ప్రజాస్వామ్యం ఎప్పుడు గెలుస్తుందో చెప్పలేం కానీ ప్రతి ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీలు మాత్రం గెలుస్తున్నాయి. ప్రజలే గెలవాలి.. ప్రజలే ఎజెండా అంటూ నాయకులు ఇచ్చే ఉపన్యాసాలు నీటిపై రాతల్లా మారుతున్నాయి. 2024 మే 13న అసెంబ్లీకి సంబంధించి చీపురుపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ధన ప్రవాహం విచ్చలవిడిగా సాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బుని నీళ్లలా ఖర్చు చేశారు. ఓటర్ల చుట్టూ కార్యకర్తలు ప్రదక్షిణలు చేస్తూ ఓటు వేయించుకున్నారు. షెడ్యూల్‌కి పోలింగ్‌కి 40 రోజులు సమయం ఉండడంతో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడైంది. ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడటంతో ఖర్చు అమాంతంగా పెరిగింది. అభ్యర్థులు తమ గెలుపు కోసం చివరి రెండు రోజులూ ఓట్లు కొనుగోలులో వెనక్కి తగ్గకపోవడంతో కోట్లాది రూపాయల నగదు చేతులు మారాయి. డబ్బుతో పాటు కొత్తగా నమోదు చేసుకున్న యువ ఓటర్లు ఉత్సాహం చూపడంతో పోలింగ్ శాతం పెరిగింది.

విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ

చీపురుపల్లి నియోజకవర్గంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలున్నాయి. ఈ నియోజకవర్గం అత్యంత ఖరీదైన నియోజకవర్గంగా మారింది. ఇక్కడ నుంచి వైసిపి తరుపున మంత్రి బొత్స సత్యనారాయణ, టిడిపి నుంచి కిమిడి కళావెంకటరావు ప్రధానంగా పోటీ పడ్డారు. వీరిరువురు సుమారు 40 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. షెడ్యూల్ విడుదైలనప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సభలు, సమావేశాలు, ప్రచారాలు, ర్యాలీలతో పాటు ఓటర్లకి డబ్బు పంపిణీ చేసే వరకు విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు నియోజకవర్గంలోని ప్రజలు, విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

ఎవరు ఎప్పుడు గెలిచారంటే.!

నియోజకవర్గం పునర్విభజన జరిగినప్పటి నుంచి చీపురుపల్లి నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. పెరిగిన శాతంతో పాటు పోటీ చేసే అభ్యర్థులు మారి మారి గెలుస్తున్నారు. 2014లో నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు 1,88,978 ఉండగా 1,53,273 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అప్పటిలో 81.1 శాతం పోలింగ్ జరిగింది. కాగా అప్పటిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో టిడిపి తరుపున పోటీ చేసిన కిమిడి మృణాలిని 63,787 ఓట్లు సాధించి బొత్స సత్యనారాయణపై 20,842 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. కాగా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణకు 42,945 ఓట్లు రాగా, వైసిపి తరుపున పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్‌కు 42,179 ఓట్లు లభించాయి. 2019లో జరిగిన ఎన్నికలలో నియోజకవర్గంలో 1,98,832 మంది ఓటర్లుండగా 1,65,174 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో 83 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వైసిపి తరుపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణకు 88,586 ఓట్లు లభించగా టిడిపి తరుపున పోటీ చేసిన కిమిడి నాగార్జునకి 61,879 ఓట్లు లభించాయి. కాగా కిమిడి నాగార్జునపై బొత్స సత్యనారాయణ 26,707 ఓట్లు మెజార్టి సాధించారు. 2024లో నియోజకవర్గంలో 2,05,484 మంది ఓటర్లుండగా వీరిలో 83.48 శాతంతో 1,71,533 మంది ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఈ లెక్కన గత రెండు దపాలు జరిగిన ఎన్నికలలో పోలింగ్ శాతం పెరగడంతో గెలుపొందే అభ్యర్థులు మారారు. ఈ దఫా కూడా గతం కంటే పోలింగ్ శాతం మారడంతో అధికార పార్టీలో గుబులు పుట్టు కొస్తోందిన విశ్లేషకులు అంటున్నారు. టిడిపి మాత్రం పెరిగిన ఓటింగ్ శాతంపై గతంలో మాదిరీగానే తమ గెలుపు తథ్యం అనే ధీమాతో ఉన్నారు. ప్రభుత్వ పథకాలు నచ్చడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు తీరిక లేకుండా లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరి పక్షాన ఓటర్లు నిలబడ్డారో తమకు ఎంత వరకు లబ్ది చేకూరుతుందోనని నాయకులు బూత్‌ల వారీగా పోలైన ఓటర్ లిస్టులు తెప్పించుకొని మరీ లెక్కలేస్తున్నారు. ఎవరి లెక్క కరెక్ట్ అవుతుందో..ఎవరి లెక్క తప్పుతుందో జూన్ నెల 4న తేలనుంది

బొత్స ఆధిక్యతపై కోట్ల, తాడ్డి ప్రభావమెంత?

మండలంలో 82.65 శాతం పోలింగ్

మెరక ముడిదాం: మండలంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గత 2019 కంటే ఎక్కువగా పోలింగ్ జరిగింది. మండలంలో 46,869ఓటర్లు ఉండగా, 38,739మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 ఎన్నికలలో ఈ మండలం నుంచి బొత్స సత్యనారాయణకు 8,888 మెజారిటీ వచ్చింది. ఈ ఎన్నికల్లో మెజారిటీ రాదని చాలా మంది చర్చించుకుంటున్నారు. మండలంలో ప్రధాన పంచాయతీలు చినబంటుపల్లి, గర్భాంకు చెందిన అప్పటి వైసిపి నాయకులు కోట్ల మోతీలాల్ నాయుడు, కోట్ల క్రిష్ణమూర్తి నాయుడు, తాడ్డి చంద్రశేఖర్ టిడిపిలో కలిసిపోవడంతో వారి ప్రభావం వైసిపిపై పడుతుందన్న చర్చ జరుగుతోంది. ఆయా పంచాయతీల్లో ఓటర్లు మొగ్గ వైసిపి కంటే టిడిపి వైపే ఉన్నట్లు తెలిస్తోంది. మరో పెద్ద పంచాయతీ సోమలింగాపురం పరిధిలోని గోపనవలస, గొల్లల మర్రివలస గ్రామాలలో టిడిపికి మెజారిటీ రావటానికి అవకాశం ఉందని పలువురు అంచనా వేస్తున్నారు. కొర్లాం పంచాయతీ, మెరక ముడిదాం, భీమవరం పంచాయతీల నుంచి వైసిపికి అత్యధిక మెజారిటీ వస్తుందని వైసిపి నాయకులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా మండలం నుంచి అధిక మెజారిటీ బొత్సకు రాకుండా కోట్ల, తాడ్డి ప్రభావం చూపినట్లు ప్రచారం జరుగుతోంది.

నెల్లిమర్లపై చర్చ

- గత మెజార్టీపై వైసిపి లెక్కలు
- ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై జనసేన ఆశలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి గత ఆధిక్యం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు కూటమి అభ్యర్థి జనసేనకు వచ్చేనా అని నెల్లిమర్లలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లిమర్ల అసెంబ్లీకి వైసిపి, జనసేన బరిలో నిలిచి తల బడ్డాయి. అయితే ఓటింగ్ శాతం పెరగడంతో ఎవరికి నష్టం వాటిల్లుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే ఎవరికి వారే తమదే గెలుపంటే తమదే గెలుపని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైసిపి, జనసేన హోరాహోరీగా తలబడినట్లు తెలిస్తోంది. యువ ఓటర్లు జనసేనకు ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. సీనియర్లు, మహిళలూ వైసిపికి మొగ్గు చూపినట్లు చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే నగర పంచాయతీ పరిధిలో నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాల్లో మాత్రం జన సేనకు అధిక శాతం మొగ్గు చూపారని చర్చ జరుగుతుంది. గాజు గ్లాస్, బకెట్ గుర్తుల వల్ల కొంత మంది ఓటు వేసినప్పుడు ఈ రెండు గుర్తులు ఒకే వరుస క్రమంలో ఉండడం వల్ల ఇబ్బంది పడటం వల్ల కొన్ని ఓట్లు పోతాయన్న చర్చ కూడా జరుగుతోంది. ఏదేమైనా ఉత్కంఠ భరిత పోరులో జూన్ 4వరకు ఫలితాల కోసం వేచి చూడాల్సిందే.

పెరిగిన ఓటు.. ఎవరికి చేటు

ప్రజాశక్తి- శృంగవరపుకోట



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శృంగవరపుకోట నియోజకవర్గంలో 85.45 శాతం ఓటు నమోదు కావడంతో ఇరు పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరి గెలుపు ధీమాలో వారు ఉన్నారు. నియోజక వర్గంలోని ఎస్‌కోట, కొత్తవలస, వేపాడ, లక్కవ రపుకోట, జామి మండలం లోని 13 గ్రామాలు కలిపి 2,22, 475 మంది ఓటర్లు ఉండగా సోమ వారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 85.45 శాతం పోలింగ్ జరిగి జిల్లాలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైన నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. ఈ ఎన్నికల్లో లక్కవం ^పుకోట, ఎస్‌కోట మండలాలపై అధిక శాతం ఓటింగ్ తమ పార్టీకే వస్తుందని టిడిపి శ్రేణులు నమ్మకం పెట్టుకోగా కొత్తవలస, వేపాడ మండ లాలపై వైసిపి శ్రేణులు ఆసలు పెట్టుకున్నారు. రఘురాజు గ్రూపు ఈ ఎన్నికల్లో టిడిపికి మద్దతు ప్రకటించడం ఆ పార్టీకి కలిసొస్తుందని టిడిపి నాయకులు అంచనా వేసుకుంటు న్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ గ్రూపు లలిత కుమారికి వ్యతిరేకంగా పనిచేస్తే ఆ ఓట్లు తమకే పడతాయనీ వైసిపి శ్రేణులు చర్చించుకుం టున్నాయి. ఇది ఇలా ఉండగా ఈ ఎన్నికల్లో టిడిపి శ్రేణులు తమ పార్టీకి పనిచేసిన విధంగా వైసిపి శ్రేణులు ఆ పార్టీకి పనిచేయలేదని నియోజకవర్గంలో ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఎవరు గెలిచినా వెయ్యి, రెండు వేలు మెజార్టీతో గట్టెక్కుతారని చర్చించుకుంటు న్నారు. ఏది ఏమైనాప్పటికీ అభ్యర్థుల భవితవ్యం తేలాలంటే జూన్ 4 వరకూ వేచి చూడాల్సిందే.

- గెలుపు పై ఎవరి ధీమా వారిదే
- లెక్కలేసుకుంటున్న పార్టీలు

ఇరు పార్టీలకూ క్రాస్ ఓటింగ్ గుబులు

వేపాడ : ఈ సార్వత్రిక ఎన్నికలో మండలంలో పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగినట్లు చర్చ జరుగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలో గ్రూపులు ఉండటం వల్ల పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందని తెలిస్తోంది. దీంతో ఇరు పార్టీల్లో గుబులు మొదలైంది. క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప ముంచుతుందోనన్న ఆందోళన నెలకొంది. తమకే ఎక్కువ ఓట్లు వస్తాయని వైసిపి, కాదు తమకే అధిక ఓటు వస్తాయని టిడిపి నాయకులు బయటకు మేకపోతు గంభీరం ప్రదర్శిస్తున్నా లోలోపల క్రాస్ ఓటుపై మల్లగుల్లాలు పడుతున్నట్లు చర్చించుకుంటున్నారు. పైగా ఇద్దరి దగ్గరా ఈ సారి ఓటర్లు డబ్బులు తీసుకుని వారికి నచ్చిన వారికేయడంతో లెక్కలు కట్టలేని పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు జారీచేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న వెకేషన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లను తక్షణమే జారిచేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఫెడరేషన్ జోనల్ సమావేశాన్ని బొబ్బిలి మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జె సి రాజు మాట్లాడుతూ ఎఫ్ఆర్ 82, జిఒ నెం 114 ప్రకారం వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సంపాదిత సేవలకు అర్హులని, శిక్షణా తరగ తులు, విధుల్లో ఎన్ని రోజులు పాల్గొంటే ఆ మేరకు దామాషా పద్ధతిలో సంపాదిత సెలవులకు అర్హులు అవుతారని అన్నారు. అందుకోసం ఆయా నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ జారిచేసేలా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కౌన్సెలర్ పద్మావతి మాట్లా డుతూ డ్యూటీ సర్టిఫికెట్ల జారీ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారికి కూడా ఎపిటిఎఫ్ లిఖితపూర్వకంగా ప్రాతినిధ్యం చేసిందని ఆమె తెలిపారు. అనంతరం వచ్చే విద్యా సంవత్సరంలో అకాడ మిక్ పరంగా ప్రభుత్వానికి ప్రాతినిత్యం చేయాల్సిన విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగి నాయుడు, సిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, వివిద మండలాల భాద్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాజు

నేటి నుంచి వయోజనులకు బిసిజి టీకా

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస పిహెచ్‌సి పరిధిలో గురువారం నుంచి వయోజనులకు క్షయవ్యాధి నివారణ కోసం బిసిజి టీకాలు వేస్తామని డాక్టర్ సీతల్ వర్మ అన్నారు. పిహెచ్‌సి పరిధిలో 13 కేంద్రాలలో రోజుకి 70 మందికి ఒకొక్క టీమ్ 500 మంది చొప్పున టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధానంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఈ టీకాలకు అర్హులన్నారు. ముఖ్యంగా పాత క్షయ (టిబి) రోగులు, 2 సంవత్సరాలు నిండిన క్షయ రోగుల కుటుంభ సభ్యులు, మధుమేహ వ్యాధి గ్రస్తులు, ధూమపానం చేసేవారు, 60 సంవత్సరాలు దాటిన వారు, ఎత్తుకు తగ్గ బరువు లేని వయోవృద్ధులు తప్పక ఈ బిసిజి టీకా వేసుకోవాలన్నారు. ఈ టీకాను గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవి ఎయిడ్స్, కేన్సర్, అవయవ మార్పిడి చేసుకున్నవారు, ఆరు మాసాల్లో రక్త మార్పిడి చేసుకున్నవారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, ప్రస్తుతం జ్వరం, దగ్గు, బరువు తగ్గటం వంటి వారు టీకా వేసుకోకూడదన్నారు. సమాజంలో ఈ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందన్నారు. వ్యాధిని నివారించడానికి, వ్యాధి తీవ్రత తగ్గించటానికి ఈ టీకా వేసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించాలని, ఆరోగ్య సిబ్బందికి సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డుపైకి మురుగునీరు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఒకటో వార్డులో స్వీపర్‌వీధిలో రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించలేదు. దీంతో నివాసాల నుంచి వచ్చే నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులతోపాటు స్వీపర్ వీధిలో నివాసం ఉంటున్న మున్సిపల్ కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షంతో బురదంతా రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్నా, తాము నివసించే వార్డులో కనీస మౌలిక సదుపాయాల కల్పించేందుకు అటు మున్సిపల్ అధికారులు గానీ, ఇటు పాలకవర్గ సభ్యులు గానీ చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. తమ వార్డులో కాలువలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అధ్వానంగా కాలువలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చెత్తబుట్టల్లో వేయాల్సిన వ్యర్థాలను కాలువలో వేయడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యపై మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి షాపుల వద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయడంతోపాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చెబుతున్నారు. నిబంధనలు అతిక్రమించే వారి నుండి అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యాన వనాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

ఉపాధి ఎపిడి జనార్ధన్

మాట్లాడుతున్న ఎపిడి జనార్ధన్

మండలంలోని 200 ఎకరాల్లో ఈ ఏడాది ఉద్యానవనాభివృద్ధి (హార్టికల్చర్) చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధిహామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జనార్ధన్ తెలిపారు. మండల ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు వంద ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. 2 సంవత్సరాల కాలంలో ఎకరాకు రూ.1.13లక్షలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. వందరోజుల పని కోసం ప్రణాళికలు రూపొందించామని, ఎస్‌సి, ఎస్‌టి వికలాంగులకు వందశాతం పని కల్పించాలని సూచించారు. కొలతలు ప్రాప్తికి పనులు చేపట్టాలని, సరాసరి కూలీ కింద రూ.300లు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది అమృత సరోవర్, ఫారంఫాండ్స్, రింగ్ ట్రెంచిల నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఒ జి.త్రినాథరావు, ఈసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీలమాంబపురంలో చోరీ

8 తులాల బంగారం,

రూ.5 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని ఇటిక పంచాయతీ నీలమాంబపురం గ్రామానికి చెందిన పురోహితుడు కర్రి సతీష్ ఇంటిలో చోరీ జరిగింది. ఈనెల 10న తన మేనమామ మృతిచెందడంతో సతీష్ కుటుంబ సమేతంగా రంపచోడవరం వెళ్లారు. 13న ఓటు వేసేందుకు సతీష్ వచ్చి చూడగా ఇంటి తాళం తీసి ఉంది. బీరువా తాళం విరగ్గొట్టి ఎనిమిది తులాల బంగారం, సుమారు 5 లక్షల పైబడి నగదు చోరీకి గురైనట్లు జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్లో ఆయన ఫిర్యాదుచేశారు. ఎస్ఐ పి.అనిష్ కేసు నమోదు చేశారు. బుధవారం పాలకొండ డిఎస్‌పి జి.వి కృష్ణారావు, చినమేరంగి సిఐ మంగరాజు గ్రామానికి చేరుకుని, దర్యాప్తు చేశారు. క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది.

ఆర్‌బికెలో చోరీ

మక్కువ: మండలంలోని కాశీపట్నం సచివాలయ పరిధిలో ఉన్న ఆర్‌బికెలో దొంగలు చొరబడి కంప్యూటర్లు, స్మార్ట్‌టీవీని ఎత్తుకుపోయారు. ఎన్నికల తర్వాత విధుల్లోకి వెళ్లిన ఉద్యోగులకు కంప్యూటర్ లేని విషయాన్ని గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదును అందజేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

మామిడి తోటలో మహిళ మృతి

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస- రాముడువలసకు మధ్యలో ఉన్న మామిడి తోటలో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ చేరుకుని దర్యాప్తు చేయగా మృతురాలు పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన రేగు పైడితల్లి (65)గా గుర్తించారు. మతిస్థిమితం లేకపోవడంతో తాతగారు ఊరు కొండదేవుపల్లి వచ్చి మామిడి తోటలో వారం రోజుల క్రితం మరణించి ఉండవచ్చునని పోలీసులు భావిస్తు న్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు వున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కార్యదర్శి మృతి

సాలూరు: మండలంలోని శివరాంపురం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ (40) బుధవారం గుండెపోటుతో మరణించారు. బుధవారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో రామభద్రపురంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు ఎ.ప్రవీణ్ కుమార్, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, వైసిపి మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

విజ్ఞాన శిబిరాలతో పిల్లల్లో చురుకుదనం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రంథాలయంలో ఆడుకుంటున్న పిల్లలు

వేసవి విజ్ఞాన శిబిరాల వల్ల పిల్లల్లో చురుకుదనం ఏర్పడుతుందని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులచే నీతి కథలు చదివించడం, కథలోని నీతిని తెలియజేశారు. విద్యార్థులను క్యారం బోర్డు, చదరంగం, ఇతర ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.